రేపు చాట్రాయిలో 'స్పందన'

చాట్రాయి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొంటారని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో తెలియజేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సత్యాలపాడు(గంపలగూడెం): సత్యాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు దాత సహకారంతో పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. గతంలో పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన గంగినేనిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం జీవీ రామకృష్ణ వారి సోదరి సివిల్ సప్‌లై జాయింట్ డైరెక్టర్ జి.రంగా కుమారి సౌజన్యంతో పాఠశాలలోని 45 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం ఎంఆర్ శేషంరాజు పాల్గొన్నారు.













భారీ వర్షం


ముసునూరులో పొగాకు పందిళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి


మొక్క జొన్న కల్లాలపై నిలిచిన వర్షపు నీరు


తోలుకోడులో ఓ ఇంటి ప్రాంగణంలో పడిన వడగళ్లు

మైలవరం: మైలవరంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం శనివారం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్లు పడ్డాయి.

భారీ వర్షం

రెడ్డిగూడెం: అల్పపీడన ద్రోణీ ప్రభావంతో శనివారం భారీ వర్షం కురవడంతో మామిడి, మొక్కజొన్న రైతులల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మండలంలో 20వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. కోత దశకు వచ్చిన మొక్కజొన్న కల్లాలపై పట్టాలు కప్పక పోవడంతో మధ్యాహ్నం కురిసిన వర్షానికి పూర్తిగా తడిసిపోయాయి. నరసింహారావుపాలెం, సి.గుడిపాడు, బూరుగుగూడెం, గంటిపాడు, పోతనపల్లి,గ్రామాల్లో మిర్చి, తుమ్మగూడెం, టి.గుడిపాడు, మర్లపాలెం గ్రామాల్లో పుగాకు మండెలు తడిసి పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. పొగాకు, మామిడికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. వర్షాలు ఆగితే నష్టం ఉండబోదని ఇదే విధంగా మరికొన్ని రోజులు కురిస్తే నష్టం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రైతుల్లో ఆందోళన

ముసునూరు: అల్పపీడన ప్రభావంతో శనివారం కురిసిన వర్షంతో మండలంలోని పొగాకు రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పొట్ట విరుపుడు, కల్లాల దశలో ఉండడంతో రైతులు పంటను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. వలసపల్లి, యల్లాపురం గ్రామ రైతులు కల్లాల్లో ఉన్న తమ మిర్చి పంటను కాపాడు కునేందుకు ప్రయాస పడుతున్నారు. కాగా వ్యవసాయాధికారి చేబత్తిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లోని రైతులు పంటలను కాపాడుకోవాలని సూచనలు ఇస్తూ అప్రమత్తం చేస్తున్నారు. పొగాకు పందిళ్లపై పరదాలు కప్పి, నీరు నిలవకుండా చూడాలని సూచించారు. మిర్చి, మొక్కజొన్న పంటలను మెరక ప్రదేశాల్లో పరదాలు కప్పి ఉంచడంతో పాటు, వర్షం నీరు రాకుండా కల్లాల చుట్టూ బోదెలు తవ్వి రక్షించుకోవాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీలో ఉచిత దంత వైద్య శిబిరం



నూజివీడు: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో శ్రీభాను దంత వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని చాన్సలర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆరోగ్య సంరక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం భాను దంత వైద్యశాల దంత వైద్యులు దేవిశెట్టి దినేష్‌బాబు మాట్లాడుతూ దంతక్షయం, మిశ్రమ దంతాలు, నోటి దుర్వాసన తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 450 మంది విద్యార్థులు, సిబ్బందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ఏఓ ప్రదీప్, ఆస్పత్రి వైద్యులు దుర్గాభవాని పాల్గొన్నారు.

మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): మత్తు పదార్థాల వినియోగంతో మానసిక, శారీరక, అనారోగ్యపరమైన అనర్థాలు సంభవిస్తాయని నిమ్రా కళాశాల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి అన్నారు. జూపూడి నిమ్రా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకంతో జీవితాలు పాడుచేసుకోవద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్ ఖాన్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అనురాధ

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి సచివాలయాన్ని జిల్లా అభివృద్ధి అధికారి అనురాధ శనివారం తనిఖీ చేశారు. సుస్థిర అభివృద్ధిలో భాగంగా సచివాలయంలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై ఉద్యోగులను ప్రశ్నించారు. సచివాలయంలో నిర్వహిస్తున్న రికార్డులు, జరుగుతున్న అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీల పనితీరుపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


విశ్రాంత ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సంఘ నాయకులు

విస్సన్నపేట: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.లవ కుమార్ తెలిపారు. విస్సన్నపేట యూనిట్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం 17వ వార్షికోత్సవం సంఘ భవనం వద్ద శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పుల్లయ్య, సంఘ అధ్యక్షుడు ఎన్.సూరిరాజు, మోహనరావు, రాజేంద్రప్రసాద్, ఉపఖజానా అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


తిరువూరు గ్రంథాలయానికి రీడింగ్ ప్రాంక్‌ల వితరణ

తిరువూరు: విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్ కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన పాఠకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమైన అన్ని పుస్తకాలూ సరఫరా చేస్తున్నామని, దాతలు కూడా గ్రంథాలయాభివృద్ధికి సహకరించాలని కోరారు. స్థానిక కామధేను ఎంటర్ ప్రైజెస్, రాహుల్ ఫైనాన్స్ సంస్థల నిర్వాహకులు పాఠకులకు అవసరమైన రీడింగ్ ప్రాంక్స్‌ను కార్యదర్శికి అందజేశారు. గ్రంథాలయాధికారి కోగంటి పద్మావతి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం


కె.తాడేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బాలల హక్కుల పరిరక్షణ ప్రతిజ్ఞ

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని చైల్డ్ లైన్-1098 జిల్లా కో-ఆర్డినేటర్ ఎ.రమేష్ అన్నారు. శనివారం కొత్తూరు తాడేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణలో పాత్ర అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైన, ఎప్పుడైనా బాలలు ఆపదలో ఉంటే వెంటనే చైల్డ్ లైన్-1098 కి గాని పోలీసు -100/112, ఉమెన్ హెల్ప్‌లైన్ 181కి ఫోన్ చేయాలని కోరారు. సదస్సు అనంతరం బాలల హక్కుల పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు.సచివాలయ కార్యదర్శి మురళీమోహనరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, మహిళా పోలీసు వి.అరుణకుమారి, కౌన్సిలర్ మేరీ ప్రవీణ్, స్వరూప, సత్యనారాయణ పాల్గొన్నారు.

రెండు లక్షల చేపపిల్లలు విడుదల


తుమ్మలపాలెంలో చేప పిల్లలను వదులుతున్న సర్పంచ్ వెంకటరమణ, అధికారులు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని తుమ్మలపాలెం వద్ద కృష్ణానదిలో రెండు లక్షల చేప పిల్లలను శనివారం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొమ్ము వెంకటరమణ, కొండపల్లి సచివాలయాల కన్వీనర్ లంకే అంకమోహనరావు మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధికి ఇటీవల ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చేతుల మీదుగా 13 లక్షల చేప పిల్లలను నదిలో వదిలినట్లు తెలిపారు. ఇప్పుడు మరో రెండు లక్షల పిల్లలను వదిలామన్నారు. కార్యక్రమంలో ప్రధానమంత్రి మత్స్య యోజన పథకం జిల్లా డైరెక్టర్ లంకే గోవిందరాజు, మత్స్యశాఖ డీడీ నాగరాజు, నల్లమోతు చిన్నయ్య, ప్రకాష్, రామ్‌లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

జి.కొండూరు: మండలంలోని కుంటముక్కల గ్రామంలో విజయవాడ స్టెల్లా కాలేజీ బృందం, భారత్ అభియాన్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని సర్పంచ్ వంగూరి కుమారి కెనడీ ప్రారంభించారు.

కమ్యూనిటీహాలు నిర్మాణానికి రూ.25 లక్షల మంజూరు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామ శివారు కొత్తూరులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసిందని సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు తెలిపారు. కొత్తూరు పంచాయతీ కామన్ స్థలంలో కమ్యూనిటీహాలు నిర్మించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

31లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ

మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఈనెల 31వ తేదీ లోగా మొత్తం బకాయిలు ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌వో రత్నావళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో మేరకు రాష్ట్రంలో అన్ని నగర పాలక, పురపాలక సంఘాల్లో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలను, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీ మాఫీ చేసే వీలుందన్నారు. పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఒకేసారి ఈనెల 31వ తేదీ లోపు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ


ప్యాడ్లు అందజేస్తున్న పి.పండు తదితరులు

ఇబ్రహీంపట్నం: పీవీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సహాయ మాత పాఠశాల టెన్త్‌క్లాస్ విద్యార్థులకు ప్యాడ్లు, జామెంట్రీ బాక్స్‌లు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పచ్చిగోళ్ల పండు మాట్లాడుతూ వచ్చే నెలలో జరగనున్న టెన్త్‌క్లాస్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.

ఎరువుల షాపుల తనిఖీ

వత్సవాయి: ఎరువులు, పురుగు మందుల షాపులను మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మక్కపేట, వత్సవాయిలో షాపులను పరిశీలించారు. షాపులలో ఉన్న స్టాకు, రికార్డులలో నమోదు అయి ఉన్న వివరాలను చెక్ చేసి సరిచూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన ధరలకే రైతులకు ఎరువులను అమ్మాలన్నారు. నిబంధలనకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే షాపుల అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

నందిగామ: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణే లక్ష్యంగా ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సతీష్ పేర్కొన్నారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై అంబారుపేట క్రాస్ రోడ్ వద్ద శనివారం ప్రమాదాలు నివారించేందుకు రేడియం స్టిక్కర్లు , స్టాప్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ ఓ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు కూడా అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలి

మైలవరం: సేంద్రియ ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. రసాయనిక ఎరువులు వాడకం వలన భూసారం తగ్గిపోయి పంటల దిగుబడి తగ్గిపోతుందని, అంతేగాక పంటలను తెగుళ్లు, పురుగులు ఆశించడం వలన తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. మైలవరం నియోజకవర్గంలో 30వేల ఎకరాల్లో రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, పసుపు, కూరగాయల పంటలు, మల్లె తోటలు సాగుచేస్తున్నారు. మరో 22వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఆధునిక పద్ధతులు అవలంబించడంతో పంటలకు చీడపీడలు, కొత్త రకం తెగుళ్లు ఆశిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో ఖర్చు తగ్గుతుందని, దిగుబడి కూడా పెరుగుతుందని రైతు సదస్సుల్లో శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



మైలవరంలో ఏర్పాటు చేసిన వర్మీకంపోస్టు యూనిట్ ప్లాంట్

వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలి

మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 2002లో స్థానిక మార్కెట్ యార్డులో వర్మీకంపోస్టు యూనిట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై మక్కువ చూపించారు. వర్మీ కంపోస్టును మైలవరం రైతు బజారులో స్టాల్‌ను ఏర్పాటు చేసి విక్రయించారు. సేంద్రియ ఎరువులు వినియోగంతో రైతులకు సాగు ఖర్చులు కూడా తగ్గుతాయి. తెగుళ్లు, పురుగుల బాధ ఉండదు.

–ఆర్.నాగేశ్వరరావు, రైతు, చంద్రాల











క్లుప్తంగా

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



యాగశాలలో హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద కొండపైనున్న శ్రీ భ్రమరాంబ సమేత రామ లింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గుహాలయంలో శనివారం శ్రీ సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం గవ్యాంత పూజలు, పీఠపూజ, రత్నన్యాసం జరిగాయి. అనంతరం పుణ్య దంపతులు కల శాలతో వెళ్లి విగ్రహ ప్రతిష్టలు నిర్వహించారు. పుల్లేటికుర్తి భోగేశ్వరశర్మ శిష్య బృందం ఆధ్వ ర్యంలో కొండ ప్రాంతం వేద మంత్రాలతో మారుమోగింది. కుంబాభిషేకం అనంతరం మహాపూర్ణాహుతి శాంతి కల్యాణం నిర్వహిం చారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు, అన్నసం తర్పణ చేశారు.

నున్నలో :

నున్న గ్రామంలోని తూర్పు రామాలయం నందు వినాయక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం సంప్రదాయ బద్ధంగా నిర్వంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన పూజ, స్వామివారికి వాస్తు పూజ, అనంతరం పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. పిమ్మట వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాత భీమవరపు వెంక టరెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మం డలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఆలయ ధర్మకర్త భీమవరపు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, రం గారెడ్డి, గ్రామస్తులు పాల్గొని స్వామికి పూజలు చేశారు. వల్లభాపురం జనార్దన్ విగ్రహప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ అర్చకులు వేదాంత బాలాజీ, పాల్గొన్నారు.

నేడు ఈడుపుగల్లులో ఉచిత వైద్య శిబిరం

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు గ్రామ పంచాయతీలో ఈనెల 19న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఈఓ బి.వెంకటే శ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్షత్ చెవి, ముక్కు, గొంతు, చిన్న పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ బ్యాగులను దూరం పెట్టాలి



ముస్తాబాదలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: వస్త్రంతో తయారు చేసిన సంచులు, జ్యూట్ బ్యాగ్‌లు మాత్రమే ప్రజలు వినియోగించాలని కోరుతూ ముస్తాబాదలో శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విజయవాడ చిల్డ్రన్స్, స్కూల్స్, ట్యుటోరియల్ అసోసియేషన్ సింగ్ నగర్ డివిజన్ పిలుపు మేరకు స్థానిక నవభారత్ హైస్కూల్ విద్యా ర్థులు క్యారీ బ్యాగులు వాడవద్దంటూ గ్రామ స్తులకు విజ్ఞప్తి చేశారు. కరస్పాండెంట్ షేక్ ఇమాం మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు భూమిలో కరగడానికి పదిలక్షల సంవత్సరాలు పడుతుందని, దీని కారణంగా భూమి పాడై పోతుందని చెప్పారు. అందుకే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను అందరూ దూరం పెట్టాలన్నారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా, ఉపాధ్యా యులు హసీనా, దస్తగిరి, రామభద్రరాజు, జయశ్రీ, అశోక్ రాణి, సునీత, భానుశ్రీ తదిత రులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్ధారణ పరీ క్షలు చేయించుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. ఆత్కూరు గ్రామ సచివాలయం ఆవర ణలో బ్రైట్ లైట్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మోట్రు శశి జ్ఞాపకార్థం తండ్రి నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు చికిత్స చేయించుకోవాలని అన్నారు. అనంతరం కళ్ల జోళ్లు అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాయి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా పన్నుల వసూళ్లు

- 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపులో పన్నుల వసూళ్లలో వేగం
- ఆస్తిపన్ను రూ.156 కోట్ల డిమాండ్ ఉండగా 80 శాతం వసూలు
- తాగునీరు, డ్రైనేజీ పన్నుల కూడా 50 శాతం పైగా
- మూడు సర్కిళ్ల పరిధిలో 24 కలెక్షన్ కేంద్రాలు



విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ 2022–23 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్లు ఆశాజకంగా సాగుతోంది. దీర్ఘకాలి కంగా పేరుకుపోయిన మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించటంతో ఈ ఏడాది పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధిస్తామని అధికారులు ప్రకటించారు. పన్నుల వసూళ్లలో వీఎంసీ రెవెన్యూ విభాగం క్షేత్ర స్థాయి సిబ్బందితోపాటు సచివాలయ సెక్రటరీల ప్రమేయం తోడవ్వటంతో నగరంలో మొత్తం 2.7 లక్షల ఎసెస్‌మెంట్లకు 2022–23 ఏడాదికి ఆస్తిపన్ను డిమాండ్ రూ.156.46 కోట్లుండగా ఇప్పటి వరకు 80 శాతం వసూళ్లతో రూ. 124.48 కోట్లు వసూళ్లయ య్యాయి. గత ఏడాది ఈ సమయానికి రూ. 106 కోట్లు మాత్రమే వచ్చాయి. కుళాయి కనెక్షన్లు మొత్తం 1.28 లక్షలు ఉండగా వాటికి తాగునీటి పన్ను గత ఏడాది రూ. 24.82 కోట్లు మాత్రమే వసూళ్లవ్వగా ఈ ఏడాది రూ. ఇప్పటి వరకు రూ. 32.8 కోట్లు వచ్చాయి. నగరంలో మొత్తం 50 వేల యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) కనెక్షన్లకు డ్రైనేజీ పన్ను రూ. 42 కోట్లు డిమాండ్ ఉండగా గత ఏడాది రూ.25 కోట్లు మాత్రమే వసూళ్లవ్వగా ఈ ఏడాది రూ. 35 కోట్లు వచ్చాయి. ఖాళీ స్థలాల పన్నుల వ్యవహారంలో రూ.200 కోట్లు డిమాండ్ ఉండగా అందులో రూ.22 కోట్లు మాత్రమే వసూళ్లల య్యాయి. గత ఏడాది ఈ విభగంలో రూ. 17 కోట్లు మాత్రమే వచ్చాయి. పన్నుల కలెక్షన్లలో మరింత వేగం పెంచుతామని అధికారులు ప్రకటించారు. పన్ను చెల్లింపుదారుల కోసం నగరంలో ప్రత్యేకంగా మూడు సర్కిళ్లలో 24 కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. పన్నుల వసూళ్లపై అన్ని డివిజన్లలో రెసిడెన్షియల్, వ్యాపార ప్రాంతాల్లో మైక్‌ల ద్వారా, కరపత్రాలతో చేస్తున్న ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నగరంలోని ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నులపై విధించిన వడ్డీని ఈ నెల 31వ తేదీ వరకు మాఫీ చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది.

లక్ష్యాన్ని చేరుకుంటాం

పన్నుల కలెక్షన్లలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ వసూళ్లు చేస్తున్నాం. కోర్టు కేసులు మినహాయించి మిగిలిన వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించా. ఈ ఏడాది రూ.156 కోట్లు డిమాండ్ ఉండగా లక్ష్యం దశగా చర్యలు తీసుకుంటున్నాం. మొండిబకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు పన్ను చెల్లింపు లపై అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్ర మాలు చేపట్టాం.

డి. వెంకటలక్ష్మి
వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ)

పద కవితకు ఆద్యుడు అన్నమయ్య

వేడుకగా అన్నమయ్య జయంతి



మాట్లాడుతున్న కోదండరామయ్య, వేదికమీద కుమార సూర్యనారాయణ, గౌరీనాథ్, శ్యాంప్రసాద్

విజయవాడ కల్చరల్: పదకవితకు ఆద్యుడు అన్నమయ్య అని గాయకుడు ఆకురాతి కోదండ రామయ్య అన్నారు. భక్త నారద గాన సభ ఆధ్వర్యం లో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో శనివారం పద కవితా మహుడు తాళ్లపాక అన్న మాచార్యుడు 550 వ జయంతి ఉత్సవం, అన్న మయ్య సంకీర్తన కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరామయ్య మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు భక్తిభావ రంజితాలు అని అభివర్ణించారు. అన్నమయ్య శ్రీ వెంకటేశ్వరునిమీద 32 వేల సంకీర్తనలు రచిం చారని తెలిపారు. టీటీడీ అన్నమయ్య సంకీర్తన లకు విశేష ప్రచారం కలిగిస్తునట్లు చెప్పారు. సం గీత విద్వాంసులు కుమార సూర్యనారాయణ, పోవూరి గౌరీనాథ్, డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి, పాల్గొన్నారు. గాయకుడు కోదండరామయ్య అన్న మయ్య సంకీర్తనలు భక్తిగా ఆలపించారు. దావులూరి వీరభద్రరావు, చిట్టిబాబు, రామ్మోహన్ వాద్య సహకారం అందించారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీకి తాడిగడప విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని హాసినిగీతను అభినందిస్తున్న హెచ్ఎం కనకదుర్గ, ఉపాధ్యాయులు

పెనమలూరు: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీకి తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ని రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీకి ఎం పికయింది. పాఠశాలకు చెందిన విద్యార్థిని తలారి హాసినిగీత మాస్కుప్రో అనే ప్రాజెక్టును రూపొందిం చింది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపిక చేశారు. ప్రాజెక్టు వివరాల్లోకి వెళితే... నేడు మనం ప్రతి రోజు ఉపయోగించే మాస్కు వలన ఆక్సిజన్ తగ్గకుండా, వదిలే కార్బన్ డయాక్సైడ్ బయటకు వెళ్లేలా, మాస్కు వలన నీటి ఆవిరి కళ్ల జోడుపై పడకుండా ఉండే విధంగా ఇబ్బందులు తొలగ టానికి నాణ్యమైన మాస్కును(మాస్కుప్రో) హాసిని గీతిక తయారు చేసింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని హాసినిగీతికను, గైడ్ మాగంటి శ్రీనివా సరావును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ అభినందించారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమి పూజ

రూ.4 కోట్లు విరాళం ఇచ్చిన వెలగపూడి ఉమామహేశ్వరరావు దంపతులు

పెనమలూరు: యనమలకుదురులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ఏపీ ధార్మిక పరి షత్ సభ్యుడు సంగా నరసింహారావు శనివారం భూమి పూజ చేశారు. యనమలకుదురులో ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వెలగపూడి ట్రస్టు ఆధ్వర్యంలో వెలగపూడి ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి దం పతుల కుటుంబ సభ్యులు భవన నిర్మాణానికి అయ్యే వ్యయం రూ.4 కోట్లు విరాళం ఇవ్వటానికి ముందుకు వచ్చారు. దీంతో ప్రభుత్వం దాదాపు 32 సెంట్ల భూమి యనమలకుదురు పాత పంచాయతీ ప్రాంతంలో కేటాయించింది. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ప్రాథమిక ఆరోగ్య కేం ద్రం భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి భవనం ఆరు నెలల్లో పూర్తి చేయటానికి కృషి చేస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యనమలకుదురులో ఏర్పాటు చేయ టం వలన పరిసర ప్రాంతాల్లో నివశిస్తున్న పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

నేటి నుంచి సహజయోగ సామూహిక ధ్యాన సభలు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్ట్ సలహాదారు సాంబశివరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నేటి నుంచి మూడు రోజుల పాటు (19, 20, 21 తేదీల్లో) నగ రంలోని కృష్ణలంక పచ్చమేడ బజారులో సహజ యోగ సామూహిక ధ్యాన సభలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సహజ యోగ ట్రస్ట్ సలహాదారు మద్దాల సాంబశివరావు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శని వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సభల వివరాలను వెల్లడించారు. సామాజిక రుగ్మతలకు దివ్య ఔషధంగా సహజ యోగ మార్గాన్ని ప్రపంచా నికి మాతాజీ నిర్మలదేవి పరిచయం చేశారన్నారు. ఆమె శత జయంతి ఉత్సవాల సందర్భంగా సహజ యోగ సామూహిక సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సహజయోగ ధ్యానం ద్వారా అంతర్గత శాంతి, ఆనందం పొందుతారని పేర్కొన్నారు. ప్రతి మనిషిలోనూ నిద్రాణంగా ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేసి చుట్టూ ఉన్న పరమ చైతన్య శక్తితో అనుసంధానం చేయడం ద్వారా మానవునిలో అనూహ్యమైన పరివర్తన తీసుకురావచ్చనే సత్యాన్ని మాతాజీ కనుగొన్నారన్నారు. ట్రస్ట్ సభ్యులు అడపా రామ్మోహనరావు, ఎస్.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

టిప్పరు ఢీకొని వృద్ధుడి మృతి

గన్నవరం: టిప్పరు లారీ ఢీకొని ఓ వృద్ధుడు మృ తి చెందిన సంఘటన మండలంలోని కేసరపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని సవారిగూడెం గ్రామానికి చెందిన పామర్తి వెంకటేశ్వరరావు (75) వ్యక్తిగత పనుల నిమిత్తం సాయంత్రం టీవీఎస్ మోపెడ్‌పై కేసరపల్లి వెళ్లాడు. తిరిగి గ్రామానికి వెళ్తున్న సమయంలో సవారిగూడెం రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు దాటిన తర్వాత వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ వెనుక టైర్లు వెంకటేశ్వరరావుపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గన్నవరం ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు కుమారుడు శ్యాం బాబు ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



జగ్గయ్యపేట బలుసుపాడు రోడ్డులో తీర్చిదిద్దిన ఇల్లు



ముక్త్యాలలో సుందరంగా నిర్మించిన జగనన్న గృహం



తిరుమలగిరిలో నూతనంగా నిర్మించిన ఇల్లు

సొంతింటి కల నెరవేరుతున్న వేళ

పేదోడి సొంతింటి కల సాకారమవుతోంది. కట్టుకునేందుకు జాగా లేక ఆర్థిక స్తోమత చాలక ఇన్నాళ్లు అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. జగనన్న కాల నీలు ఏర్పాటు చేసి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక చేయూత అందించారు. మండలంలోని 17 గ్రామాల్లో పేదలకు స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 1758 మందికి సెంటు భూమి చొప్పున పంపిణీ చేశారు. సెంటు భూమిలో అద్భుతంగా, ఆకర్షణీయంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నారు. ఇప్పటికే 1017 మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. ప్రస్తుతం 400 పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన గృహాల నిర్మాణానికి లబ్ధిదారులు శ్రీకారం చుట్టారు.

– జగ్గయ్యపేట

22న కళాపీఠం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు

పామర్రు: శ్రీ శోభకృత నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీన ఉగాది పురస్కారాలను అందిస్తున్నట్లు పద్మశ్రీ ఘంటసాల – బాలు స్మారక సంగీత కళా పీఠం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, కోటి పాండురంగారావు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయం 9గంట లకు స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో లంక భీష్మకుమార్‌చే పంచాంగ శ్రవణం, అనంతరం ఐదుగురు బ్రాహ్మణులకు సత్కారం చేస్తామ న్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వివిధ రం గాల్లో ప్రముఖులైన ఏడుగురికి ఉగాది పురస్కా రాలను అందజేస్తామని చెప్పారు. తదుపరి గుడి వాడ ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్, ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్‌స్కూల్స్ అసోసియేషన్, భారత వికాస్ పరిషత్ వారి ఆధ్వర్యంలో ఘంటసాల కళాపీఠం అధ్యక్షులైన కాటూరు వెంకట మురళీ కృష్ణకు 'పామర్రు ఘంటసాల' అనే బిరుదును ప్రదానం చేస్తామన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం



పూజలు చేస్తున్న సామినేని విమలాభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువు బజారులో పునర్నిర్మించిన శ్రీ సీతారామ మందిరం (చిన్న రామా లయం)లో శనివారం శ్రీహనుమత్ సీతారామచంద్ర, లక్ష్మణ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు బాచి నప్ప కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మార్తి సాంబశివరావు యాజ్ఞికంలో అర్చకులు మంగు సాయి చైతన్యశర్మ తదితరులు ఉదయం 8 గంటలకు గణపతి పూజ గర్తన్యాసం, భీజాన్యాసం ధాతున్యాసం నిర్వహించారు. అనంతరం 10.18 నిమిషాలకు యం త్ర ప్రతిష్ఠ శ్రీహనుమత్ సీతారామచంద్ర, లక్ష్మ ణస్వామి వార్ల ప్రతిష్ఠ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వైభవంగా జరిగింది. మహోత్సవాల్లో భాగంగా అర్చకులు స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుం చి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివార్లను దర్శించుకు న్నారు.

ప్రత్యేక పూజలు..

ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమలాభాను స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయభాను కుమార్తె, అల్లుడు మారెళ్ల విజయనరసింహారెడ్డి, పద్మ ప్రయాంక ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్ర మాన్ని ప్రారంభించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, కౌన్సిలర్ కాశి అనురాధ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామి వారి శాంతి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది.

ఔషధ రంగంలో ఫార్మకోవిజిలెన్స్ ముఖ్యపాత్ర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నూతన వ్యాధుల చికిత్సా పద్ధతుల్లో ఔషధ ప్రభావాలు పర్యవేక్షించేం దుకు, మందుల సమాచారాన్ని సేకరించడం, విశ్లే షిం చడం ప్రతికూల చర్యలను నివారించడంతో ఫార్మకోవి జిలెన్స్ ముఖ్యపాత్ర పోషిస్తుందని సిద్ధార్థ వైద్య కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ఫార్మకా లజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఫార్మకో విజి లెన్స్ అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కంచర్ల సుధాకర్ మాట్లాడు తూ ఫార్మకోవిజి లెన్స్ ప్రోగ్రామ్ ఎంతో ముఖ్యమైనదన్నారు. ఫార్మ కాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకట రమణ మాట్లా డుతూ ఔషధాల భద్రతకు ఫార్మకో విజిలెన్స్ ద్వారా ముందడుగు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఔషధం జీవిత చక్రంలో భద్రత, సమర్థత అనేవి ముఖ్యమైన విగా పేర్కొన్నారు. ఫార్మకో విజిలెన్స్ అనేది ఔషధ భద్రతలో అంతర్భాగమని చెప్పారు. అనేక వ్యాధుల నివారణకు సంబంధించిన అధ్యయనంలో జరిగే ప్రతి కూల ఘటనలను ఎదుర్కోవడానికి దోహదం చేస్తుం దన్నారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ మందుల వినియోగం లో కొందరు రియాక్షన్స్‌కు గురవుతుంటారని, అలాం టి వారిపై అధ్యయనం చేసి నివారించేందుకు ఈ ఫార్మకో విజిలెన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్మోహనరావు, ఫార్మకాలజీ విభాగానికి చెందిన డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ వినీత, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

విజయవాడలో భారత్ గౌరవ్ రైలుకు ఘన స్వాగతం

స్వాగతం పలికిన సీనియర్ డీసీఎం రాంబాబు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారతదేశ సం స్కృతి, సంప్రదాయాలు, చారిత్రక, పర్యాటక ప్రదే శాలను దేశ నలుమూలలకు విస్తరించేలా రైల్వే మంత్రిత్వశాఖ భారత్ గౌరవ్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొ రేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో దేశంలోని ముఖ్యమైన పుణ్యక్షేత్రాలు, చారిత్రక, పర్యాటక ప్రదే శాలను దర్శించుకునేలా 'పుణ్యక్షేత్ర యాత్ర పూరి, కాశి, అయోధ్య' ప్రత్యేక పర్యాటక రైలును మొట్టమొ దటి సారిగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అం దుబాటులోకి తీసుకొచ్చింది. ఈ రైలును శని వారం సికింద్రాబాద్‌లో రైల్వే అధికారులు లాం ఛనంగా ప్రారంభించారు. ఈ రైలు విజయవాడకు సాయంత్రం 6 గంటలకు చేరుకోగా సీనియర్ డీసీ ఎం వావిలపల్లి రాంబాబు, ఇతర అధికారులు రైలుకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రైల్లోని యాత్రికులను పలకరించి ఈ యాత్ర తమ జీవితంలో చిరస్మరణీయ ప్రయాణంగా గుర్తుండి పోవాలని ఆకాంక్షించారు. అనంతరం మాట్లా డుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల సౌకర్యం దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటిసారిగా ఈ రైలును రైల్వేశాఖ ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో 700 మంది యాత్రికులు రిజర్వ్ చేసుకోగా అందులో విజయ వాడ నుంచి 76 మంది యాత్రికులు రైలు ఎక్కార న్నారు. 8 రాత్రుళ్లు, 9 పగళ్లు సాగే ఈ ప్రయాణంలో ఉదయం కాఫీ, అల్పాహారం, భోజనంతో పాటు సం దర్శన ప్రదేశాలకు రోడ్డు మార్గంలో రవాణ సదుపా యం, యాత్రికుల భద్రత కోసం ప్రతి కోచ్‌లో సెక్యూరిటీ, సీసీ కెమేరాలు, గైడ్‌లు తదితర ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. ప్రయాణికుల నుంచి వస్తున్న డిమాండ్‌ను బట్టి ఇదే ప్యాకేజీతో ఏప్రిల్ 18న మరో రైలును నడపనున్నట్లు తెలిపారు. స్టేషన్ డైరెక్టర్ పిబిఎస్ ప్రసాద్, పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్, ఏఏ స్‌సీ జి.మధుసూదనరావు, ఐఆర్‌సీటీసీ అధికారులు పాల్గొన్నారు.



ట్రైన్ దగ్గర రైల్వే అధికారులు





విజయవాడ రైల్వే స్టేషన్లో భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన ఆవిష్కరణ లపై విద్యార్థులు దృష్టి పెట్టాలని నేషనల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (రాయపూర్) ఈఈఈ విభాగ ఆచార్యులు డాక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్ తెలిపారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అంశం పై ఆ కళాశాల ట్రిపుల్‌ఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు శనివారం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నూతన ఆలోచనలతో కొత్త వాహనాల తయారీకి ముం దుకు వస్తే మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొ న్నారు. ఆ దిశగా విద్యార్థులు తమ మేధస్సుకు పదను పెట్టాలన్నారు. ఆధునాత సాంకేతిక వృద్ధిని తెలుసుకుంటూ తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రానిక్ వాహనాల వినియోగం భారీగా పెరగనుందన్నారు. మరో అతిథిగా హాజరైన డాక్టర్ ఈఆర్ఎం కాటయ్య మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల కోసం ప్రయోగాలపై దృష్టి పెట్టాలన్నారు. కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులను వారివారి రంగాల్లో తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత జాతీయ సదస్సుకు సంబంధించిన సావనీ ర్‌ను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

తరగతి గదుల నిర్మాణానికి రూ.4.18 కోట్ల మంజూరు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లో నుంచి నాడు-నేడు కార్యక్రమం పుట్టుకొచ్చింది. నాడు-నేడు మొదటి విడత కార్యక్రమంలో భాగంగా దాదాపు రూ.55 కోట్లతో నియోజకవర్గంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీగోడలు, విద్యుత్ సదుపాయం, విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు, మినరల్ వాటర్, రంగులు వేయడం, బ్లాక్‌బోర్డులు ఏర్పాటు తదితర అనేక సదుపాయాలను కల్పించారు. దీంతో పాఠశాలల రూపురేఖలే మారి ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో పలు పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. అలాగే పలు ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులకు కూడా సబ్జెక్టు ఉపాధ్యాయులు బోధించాలనే లక్ష్యంతో వాటిని హైస్కూళ్లలో కలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం నాడు-నేడు రెండో విడత కార్యక్రమంలో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులను మంజూరు చేసింది.


నూజివీడు ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్లో జరుగుతున్న అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులు

35 తరగతి గదుల నిర్మాణం

తరగతి గదుల కొరత లేకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టణం, మండలంలో నాలుగు హైస్కూళ్లకు కలిపి రూ.4.18 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో 35 తరగతి గదులను నిర్మించనున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున హైస్కూళ్ల అభివృద్ధికి కృషి చేసిన దాఖలాలు లేవు. పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్లో రూ.1.44 కోట్లతో 12 తరగతి గదులు, బాలికల హైస్కూల్లో రూ.1.08 కోట్లతో తొమ్మిది తరగతి గదులు, గొల్లపల్లి హైస్కూల్లో రూ.94 లక్షలతో ఎనిమిది తరగతి గదులు, మీర్జాపురం హైస్కూల్లో రూ.72 లక్షలతో ఆరు తరగతి గదులను నిర్మిస్తున్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌కు బాలికల జూనియర్ కళాశాల సైతం మంజూరైంది. దీంతో ఇక్కడ తరగతి గదుల కొరతను అధిగమించేందుకు రూ.1.08 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒకవైపు జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్సులు, బ్యాగ్, షూలు, బెల్ట్ తదితర వాటిని ఉచితంగా అందిస్తూనే మరోవైపు పాఠశాలల్లో తరగతి గదుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలను హైస్కూళ్లలో కలిపినా తరగతి గదుల కొరత లేకుండా ఉంటుంది.

ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయి. ప్రతి పాఠశాల రూపురేఖలు మార్చుకుని మంచి వసతులతో ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ తరగతి గదుల నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి నిర్మిస్తున్నారు. విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సంతోషం.

– మాదిరెడ్డి అంకిరెడ్డి, నూజివీడు









ఇంటర్ పరీక్షలకు 37 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ద్వితీయ సంవత్సర ఇంగ్లిష్ పరీక్షకు శనివారం 37మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నాలుగు కేంద్రాలలో కలిపి 1,286 మంది విద్యార్థులకు గాను 1,249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 37 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలలకు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా ఐ.గిరిదేవి, ఈదర కోటేశ్వరరావు, ఎస్.వెంకటలక్ష్మి, కె.సంధ్యాజ్యోతి వ్యవహరించారు.

తిరువూరులో 38 మంది గైర్హాజరు..

తిరువూరు: తిరువూరులో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు 38 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంగ్లిష్ పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 308 మంది విద్యార్థులకు గాను 286 మంది, నాగార్జున జూనియర్ కళాశాలలో 245 మందికి 240 మంది, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పరీక్ష కేంద్రంలో 353 మందికి 342 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు.


నూజివీడులోని ఎంటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు



